ఉచిత కంప్యూటర్ శిక్షణ

మూసాపేట: ఫతేనగర్‌లోని శ్రీ శిశు మందిర్ పాఠశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టీటీ సహకారంతో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, హెచ్‌టీఎంఎల్ వంటి వాటిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. నిరుద్యోగులు, ఇంటర్, డిగ్రీ చదువుతున్న వారు అర్హులు అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8792492849 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వినాయక నిమజ్జనంలో ఎమ్మెల్యే గాంధీ



ఎల్లమ్మబండలో వినాయక నిమజ్జనం సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీలో శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుని శోభాయాత్ర, ఎల్లమ్మబండ వినాయక నిమజ్జనం కార్యక్రమాలకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాగరాజు, ఎర్రగుడ్ల శ్రీనివాస్, జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశీనాథ్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, చిన్నోళ్ల శ్రీనివాస్, రమేష్, మహేష్‌గౌడ్, యాదగిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు సాయిచంద్‌కు ఘన నివాళి



సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ: గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్, ప్రజా గాయకుడు స్వర్గీయ సాయిచంద్ జయంతి సందర్భంగా శనివారం ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డల సంఘం కార్యాలయంలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన పాలమూరు జిల్లా నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్రంలో తనకంటూ సముచిత స్థానం సంపాదించుకున్న సాయిచంద్ లేని లోటు తీర్చలేనిది అని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంఏ.కరీం, బోయ కిషన్, గోపాస్ రవీందర్, చంద్రశేఖర్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్, కురుమయ్య, సాయి శ్రీకాంత్, మహేష్, నాగరాజు, శ్రీను కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభం



మాదాపూర్: శిల్పారామంలో శనివారం రసోల్లాస్ నేషనల్ ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభమైంది. కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా అర్ధనారీశ్వరం, ఆదిత్య హృదయం తదితర అంశాలను సురేంద్రనాథ్, బిజినాలు ప్రదర్శించి అలరించారు. అనిత ముక్త శౌర్య మోహినీయట్టం ప్రదర్శించారు. ముంబైకి చెందిన కాశ్మీరత్రివేది శిష్యబృందం భరత నాట్యాంశాలు అలరిపు, శివ పంచాక్షరీ స్తోత్రం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. పేరిణి నాట్య గురువు డాక్టర్ కళాకృష్ణకి నాట్యకళా కుసలా సాగర పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, పూర్వ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం శారదా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు జయశ్రీ శిష్యబృందం పలు అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. వినాయకవందనం, అన్నమయ్య సంకీర్తనలకు నృత్యాభినయం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాకారులు శాన్వి, సౌమ్య, ఆరాధ్య, శాంభవి, శ్రీవిద్య, చిద్విలాసిని తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండమీది పుష్పారెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్‌రాజ్ - కూకట్‌పల్లి



బాలాజీనగర్‌లో మన అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు - కూకట్‌పల్లి



వినాయక భక్త బృందం గణనాథుడి లడ్డూను రూ.4.20 లక్షలకు కైవసం చేసుకున్న రంబప్పగారి శ్రీనివాసరావు

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం

- టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వినోద్‌కుమార్, కురుమూర్తి



అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడితో నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు విడదీసి పాలన చేసిందని, ఇప్పటికీ కొన్ని కొత్త సంఘాలు పుట్టుకొచ్చి, ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టించే పనిచేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం నగర శివారులో ఏర్పాటు చేసిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇందులో నూతన జిల్లా కమిటీ ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టిందని, హెల్త్ కార్డుల విషయాన్ని తేల్చలేదన్నారు. వోడీలు లేవని విమర్శించారు. ఉద్యోగులకు గజం జాగా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మనం కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, ఉద్యోగుల ఐక్య కార్యాచరణతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. టీజీవో అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా జిల్లాలలో సమావేశాలు, ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ... అసోసియేషన్‌ను బలోపేతానికే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ.. 2023లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వివిధ శాఖల అధికారుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నారు. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, నూతన జిల్లా కమిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బి.వినోద్ కుమార్, కార్యదర్శిగా పశుసంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 మందితో అసోసియేషన్ నూతన కమిటీని సమావేశం ఎన్నుకుంది. ఇందులో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కె. వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా ఐ.విజయకుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా విష్ణు వర్ధన్ రావు (ఎఫ్ఆర్‌వో), ఎం.అర్చన, ఆర్ఎంవీ ఆనందరావు, ట్రెజరర్‌గా డి.కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.హెచ్.రమేష్, పబ్లిసిటీ సెక్రటరీగా డాక్టర్ ఇ.సత్యనారాయణ, ఆఫీసు సెక్రటరీగా ఎన్.సాయికృష్ణ, కల్చరల్ సెక్రటరీ గా బి.నాగమణి, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ శ్యామల, హెచ్.నాయుడు, డాక్టర్ ఎస్.స్వాతి, పి.డాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పూడికతీత వ్యర్థాలను తొలగించరా?

- పేరుకుపోతున్న బురదతో దుర్వాసన
- అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం



హస్మత్‌పేట పార్కు విల్లాలో బురద రోడ్డును పరిశీలిస్తున్న సయ్యద్ ఏజాజ్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో 15 రోజుల క్రితం హస్మత్‌పేట పార్కు విల్లా ప్రాంతంలో డ్రైనేజీల నుంచి మట్టి బురదను తొలగించి అక్కడే వదిలేశారు. ఆ బురద మట్టిపై నుంచి వాహనాలు వెళ్తుండటంతో ఆ రోడ్డు అంతా బురదమయంగా మారింది. ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూడికతీత వ్యర్థాల గురించి బీఆర్ఎస్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్ డివిజన్ వాటర్ వర్క్స్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తొలగిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్నా పూడికతీత మట్టి వ్యర్థాలను మాత్రం తొలగించలేదు. దీనికితోడు మరో చోట డ్రైనేజీలో నుంచి మట్టిని తీసి అక్కడే వదిలారు. వాటర్ వర్క్స్ జీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని సయ్యద్ ఏజాజ్ తెలిపారు. ఇప్పటికైన ఉన్నాధికారులు స్పందించి పూడికతీత మట్టి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొ.జైప్రకాశ్ గౌతమ్



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ జైప్రకాశ్ గౌతమ్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో క్లీనప్ డ్రైవ్ పేరిట స్వచ్ఛత కార్యక్రమం, స్వచ్ఛతా క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పనిచేసే కార్యాలయం, చదివే విద్యాసంస్థల్లో, పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ విభాగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్ పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అజయ్‌ప్రకాశ్, రాహుల్ క్విజ్ పోటీలు నిర్వహించారు.

భోజనానికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

- వాహనం తగిలి వ్యక్తి మృతి

సుభాష్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని టాటా ఇంట్రా వాహనం తాకడంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ రూప్‌సింగ్ కొంపల్లిలోని డాబర్ ఇండియా లిమిటెడ్‌లో సరుకు అన్‌లోడ్ చేసేందుకు ఈ నెల 19న డ్రైవర్ లాలాసింగ్‌తో కలిసి లారీపై వచ్చాడు. ఈ నెల 20న మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన ఐషర్ బస్సు పక్కనే ఉన్న టాటా ఆటోట్రాలీని ఢీకొట్టింది. దీంతో ట్రాలీ రోడ్డు పక్కన ఉన్న టాటా ఇంట్రా వాహనాన్ని తాకడంతో ఆ వాహనం నడుచుకుంటూ వెళ్తున్న రూప్‌సింగ్ తలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని శనివారం జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇంజినీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రెడాయ్ ప్రెసిడెంట్ వి. రాజశేఖర్‌రెడ్డి, గౌరవ అతిథులుగా జేఎన్‌టీయూ రెక్టార్ డా. కే. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కే. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. జీవీ నరసింహారెడ్డి, మెటీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సీపీ ప్రసాద్, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డా. బీ.డీన్ కుమార్ హాజరయ్యారు. విశ్వేశ్వరయ్య రూపకల్పన చేసిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, ఆయన చేసిన సేవలను వారు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సౌజన్య అన్నారు. శనివారం ప్రగతినగర్ ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ -2024 కార్యక్రమానికి హాజరైన కమిషనర్ స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకుమారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలని సూచించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వినతి..

నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని సర్వే నెంబరు 334లోని ఖాళీ స్థలంలో ప్రజల ఉపయోగార్థం కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ శనివారం జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ సౌజన్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మారుతిసాగర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, మున్సిపల్ నిధులను కేటాయించి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.

బీఎల్ఓలు సమగ్ర సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: బీఎల్ఓలు సర్వే సమగ్రంగా నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ,టీమ్ డిప్యూటీ కలెక్టర్ బి.చెన్నయ్య సూచించారు.శనివారం శేరిలింగంపల్లి సర్కిల్ నియోజకవర్గ ఈఆర్ఓ కార్యాలయాన్ని ఎలక్షన్ ఆఫీసర్ బి.చెన్నయ్య, డిప్యూటీ తహశీల్దార్ షహరాజ్‌లు సందర్శించారు. శేరిలింగంపల్లి ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ పి.ముకుంద్‌రెడ్డి, మండల తహశీల్దార్ వెంకారెడ్డి, ఏఈఆర్ఓ మోహన్‌రెడ్డిలతో కలిసి ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2025 సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ఈసీఐ నిబంధనల ప్రకారం గడువులోపు సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలలో తప్పులు ఉన్నా, కొత్తగా ఓటరు నమోదుపై బీఎల్ఓలు అవగాహన కల్పించాలన్నారు. కుటుంబంలో ఎవరైన మృతి చెందితే వారి వద్ద నుంచి సంబంధిత సర్టిఫికెట్ తీసుకోవడంతో పాటు ఫారం 7ను తీసుకోవాలన్నారు. 1500 ఓటర్లకు పై బడిన పోలింగ్‌స్టేషన్ల పరిధిలో అదనంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీ, తారానగర్, ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో ఇళ్లకు వెళ్ళి వారి నుంచి వివరాలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో టీమ్‌లు పర్యటించాయి. కార్యక్రమంలో ఏఈఆర్ఓలు ప్రేమ్‌కుమార్, వాహీద్ అలీ, డిప్యూటీ తహశీల్దార్ అవినాష్, ఏఎంసీలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గుడిసెలు కూల్చివేత.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మియాపూర్: హెచ్ఎండీఏ అధికారులు గుడిసెలు కూల్చివేస్తుండడంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ఎంఏనగర్ కాలనీలో రోడ్డు నంబర్–10లో దుర్గయ్య కూలి పనులు చేసుకుంటూ గత 20 సంవత్సరాలుగా ఎంఏనగర్‌లోనే నివాసముంటున్నాడు. గత రెండు నెలల నుండి హెచ్ఎండీఏ అధికారులు 100, 101 సర్వేనంబర్‌లలో భూమి చుట్టూ కంచె వేస్తున్నారు. ఎంఏనగర్ కాలనీ పక్కనుండి 100 సర్వేనంబర్ గల భూమి ప్రాంతంలో రోడ్డు నంబర్–10లో చివరగా దుర్గయ్య గుడిసెతో పాటు మరో రెండు గుడిసెలున్నాయి. శనివారం హెచ్ఎండీఏ అధికారులు దుర్గయ్య గుడిసెను తొలగించేందుకు ప్రయత్నించగా అతను చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు దుర్గయ్యను దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం దుర్గయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ప్రభుత్వ భూములను బడాబాబులు ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేస్తుంటే చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిమజ్జనం.. వ్యర్థాల తొలగింపు

ఐడీఎల్ చెరువుకు బారులు తీరిన గణనాథులు



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో నిమజ్జనానికి భారులు తీరిన గణనాథులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఒక పక్క చెరువును, కొలనును శుభ్రం చేస్తున్నారు. శనివారం ఒక్క రోజే సుమారు 350 వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. చుట్టు పక్కల ఉన్న వివిధ చెరువుల వద్ద ఉన్న క్రేన్లను తొలగించారు. ఐడీఎల్ చెరువు వద్ద కూడా 5 క్రేన్లకు గాను 2 క్రేన్లు అందుబాటులో ఉన్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనానికి బారులు తీరడంతో ఉదయం 11.30 గంటల వరకు నిమజ్జనం కొనసాగింది. ఇప్పటికే చెరువులోని పీఓపీ, స్టీల్‌ను పూర్తిగా తొలగించారు.



కూకట్‌పల్లి ఐడీఎల్ కొలనును శుభ్రం చేస్తున్న సిబ్బంది

తెలుగు సాహిత్యాభివృద్ధికి 'సురవరం' కృషి

నిజాంపేట్: తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డికి సముచిత గౌరవం లభించిందని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నాయకులు బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు.తెలుగు యూనివర్సిటీలో సదుపాయాలను మెరుగుపరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

జూనియర్ అసిస్టెంట్ తేజావత్ సురేష్ కుమార్ మృతి



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో 2014 నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తేజావత్ సురేష్ కుమార్ శనివారం మృతి చెందాడు. సురేష్ కుమార్ చిత్రపటానికి పలువురు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో గడిచిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఇద్దరు నిర్వాహకులు, విటుడి రిమాండ్

మోతీనగర్: వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకులు, విటుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. అల్లాపూర్‌లోని గాయత్రినగర్‌లో ఒక ప్లాట్‌లో ఇద్దరు వ్యక్తులు వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులు వంశీ కృష్ణ (29), అల్లు పార్వతి, విటుడు మహంకాళి సాయి కిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 ఫోన్‌లు, రెండు ల్యాప్‌టాప్ లు, 6,280 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.